ప్రజాశక్తి
ఆదివారం 16 జులై 2023



రోడ్డును నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మారు మూల సరిహద్దు బూర్జ పంచాయతీ తుంబవలస గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నేతలు కొర్రా శ్రీను, డి.పమత్యరాజు, కొర్రా రఘురామ్, డి.పృద్వీకుమార్ కోరారు. రోడ్డు సౌకర్యం లేక రాకపోలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వద్ద నిరసన చేపట్టారు. గ్రామం ఏర్పడి 70 ఏళ్ళు అవుతున్నా రహదారి సౌకర్యం లేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ గ్రామ సమస్యలు పట్టలేదని వాపోయారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్లు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్రా సాయి, సురేష్, బుజ్జీబాబు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

గిరి పోషణ కార్యకర్తలకు బకాయిలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:గిరి పోషణ కార్యకర్తలకు 17 నెలల బకాయి జీతాలు చెల్లించాలని మండల కేంద్రంలో శనివారం సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు కొర్ర శంకర్రావు, మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రం లేని గ్రామాలకు 2018లో "గిరి పోషణ కార్యకర్తలుగా నియమించారన్నారు. అప్పటి నుంచి గిరి పోషణ కార్యకర్తలు దగ్గర ఉన్న అంగన్వాడి కేంద్రం నుంచి పాలు, గుడ్డు, పప్పు, బియ్యం, తీసుకొని గ్రామంలో వంట చేసి పిల్లలకు పెట్టేవారన్నారు. ఆట, పాటలు కూడా నేర్పిస్తున్నారన్నారు. మీటింగ్‌కు, పిల్లలకు వంట చేయడానికి సొంత డబ్బులు వెచ్చి స్తున్నారన్నారు. ఇప్పటివరకు 17 నెలలు అవుతున్నా గౌరవ వేతనం చెల్లించలేదని తెలిపారు. కూరగాయలు, కర్రల బిల్లులు ఇవ్వలేదన్నారు. ఈనెల 21న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాఉ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సన్యాసమ్మ, శ్రీదేవి, లలిత గిరి పోషణ కార్యకర్తలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:నిరుపేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విధంగా గతంలో అమలు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రాష్ట్రంలో కొనసాగించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.జగన్నాథం డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఏమీ కొనుక్కోలేని పరిస్థితిలో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు జి మదన్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -రావికమతం: చోడవరం- నర్సీపట్నం రహదారి పనులను తక్షణమే చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో శనివారం సిపిఐ శ్రేణులు, రైతులు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటర మణ మాట్లాడుతూ, చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డు శిధిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టలేని అసమర్థ నాయకులు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్నదొర, దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.



కర్రలపై మూడు నాలుగు రేకులు పెట్టి దాని కింద వంట పొయ్యి పెట్టిన దృశ్యం

వంటశాల లేక ఇబ్బందులు

- ఆరుబయటే మిడ్డేమీల్స్ వంటలు

- వర్షం వస్తే తీవ్ర అగచాట్లు

ప్రజాశక్తి -సీలేరు


ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం ప్రారంభించి 20 ఏళ్లు దాటినా నేటికీ జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల ఏర్పాటు చేయలేదు. దీంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వంటలు చేసి విద్యార్థులకు పెట్టడానికి తీవ్ర ఆగచాట్లు పడుతున్నారు. ఈ పాఠశాలలో 253 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ మధ్యాహ్నం భోజనాలు సమకూర్చడానికి పాఠశాలలో వంటశాల సదుపాయం లేదు. ఆరుబయటే వంటలు చేయాల్సి వస్తోంది. వర్షం వస్తే వంటలు చేయడానికి మిడ్డేమీల్స్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా జోరు వాన కురిస్తే విద్యార్థులకు సమయానికి భోజనాలు పెట్టలేని దుస్థితి నెలకుంటుంది. వంట శాల నిర్మించాలని విద్యాశాఖ అధికారులకు అనేకసార్లు విన్నవించిన వారు ఆ దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఇటీవల నాడు-నేడు పనుల్లో భాగంగా స్కూల్ భవనాల పాత రేకులు తీసివేశారు. వాటితో తాత్కాలికంగా చిన్నపాటి షెడ్‌ను ఏర్పాటు చేసి అందులో వంట వార్పు చేస్తున్నారు. ఆరుబయటే విద్యార్థులకు ఆహార పదార్థాలు తయారు చేయడం వలన క్రిమి కీటకాలుతో పాటు బల్లులు పడితే విద్యార్థులకు తీవ్ర హాని తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మధ్యాహ్న భోజనం పథకం కింద భోజనాలు తయారీకి అవసరమైన వంటశాల పక్కా భవనం నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



ఆరుబయట భోజనాలు చేస్తున్న విద్యార్థులు

టేక్ హోమ్ రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల:అంగన్వాడీ లబ్దిదారులైన గర్భిణీలు, బాలింతలకు



హోమ్ రేషన్‌ను అందజేస్తున్న బుల్లిబాబు

టేక్ హెూమ్ రేషన్‌పై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో జి. మాడుగుల మండలంలో జెడ్పిటిసి వెంకట లక్ష్మి, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లి బాబు లాంచనంగా శనివారం ప్రారంభించారు. జి. మాడుగుల -1 సచివాలయ ఫరిధిలో జరిగిన సురక్ష కార్యక్రమంలో లబ్దిదారులకు రేషన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి, ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎంతో ఆలోచనతో చేపట్టిన ఈ సదుపాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టేక్ హెూమ్ రేషన్ కింద బియ్యం, గుడ్లు, నూనెతో పాటు పప్పులు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నట్లు సిడిపిఒ సువర్ణమ్మ వివరించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేఖాదికారి, డిపిఆర్ఓ పి.గోవింద రాజులు, తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఓ సిహెచ్ చంద్ర శేఖర్, వైస్ ఎంపిపి సత్యనారాయణ, సర్పంచ్లు కె.రాంబాబు, కొండమ్మ, ఎస్.రామక్రిష్ణ, కొండబాబు, ఎంపిటిసిలు విజయకుమారి, పాంగిలక్ష్మి, సన్యాసిదొర, పిఎసిఎస్ చైర్మన్ మత్స్యకొండ నాయుడు, జేఎస్ఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి

జెడ్పిటిసి సభ్యులు వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-జి.మాడుగుల: అర్హులందరికీ లబ్ది కల్పించాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న సంకల్పమని ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జెడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి సూచించారు. శనివారం జి.మాడుగుల మండలం జి.మాడుగుల- 1 సచివాలయ ఫరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటిసి మాట్లాడుతూ, ఇది వరకు ధృవపత్రాల కోసం అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి తిరిగేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా వాలంటీర్లే ఇంటింటికి వెళ్లి ఇస్తున్నారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయటమే కాకుండా మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారని, మిషన్ కనెక్ట్ పాడేరు కింద మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు మంజూరు చేసారని తెలిపారు. జి.మాడుగుల- 1, సింఘుర్భ సచివాలయాల ఫరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ, కుల, మత, వర్గ, పార్టీ రహితంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ లబ్ది చేకూరుతుందని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి పి.గోవింద రాజులు మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవతోనే వేల కొద్దీ దృవ పత్రాలు జారీ చేయడం జరుగుతోందని తెలిపారు, రెండు సచివాలయాలలో సుమారు 3,200 టోకెన్లు జారీ చేయడం జరిగిందని, అందులో 2,785 దరఖాస్తులు ఆన్లైన్ చేయగా 700 పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఓ సిహెచ్. చంద్ర శేఖర్, వైస్ ఎంపిపి సత్యనారాయణ, సర్పంచ్లు కె.రాంబాబు, కొండమ్మ, ఎస్.రామక్రిష్ణ, కొండ బాబు, ఎంపిటిసిలు విజయకుమారి, పాంగి లక్ష్మి, సన్యాసి దొర, పిఎసిఎస్ చైర్మన్ మత్స్యకొండ నాయుడు, జేఎస్ఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్ పాల్గొన్నారు.

అనంతగిరి: జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని కొత్తూరు సర్పంచ్ సారా సీతయ్య తెలిపారు. శనివారం కొత్తూరు గ్రామ సచివాలయం ప్రాంగణంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ ఉచితంగా ధ్రువపత్రాలు పొందాలని సూచించారు. కొత్తూరు పంచాయతీ ప్రజలు మాట్లాడుతూ, వాలంటీర్లు తమకు ఏ విధంగా సహకరించలేదని, దీంతో, సంక్షేమ కార్యక్రమాలు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్లు ప్రతి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున ఉన్నా తమకు ఉపయోగ పడలేదన్నారు. తమను కార్యాలయాకు వెళ్లి తెలుసుకోవాలని చెపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సర్పంచ్ సీతయ్య, స్పెషల్ ఆఫీసర్, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, తహసిల్దార్ రాంబాయి మాట్లాడుతూ, వాలంటీర్లు పనితీరు మార్చుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఒ .సూర్యకుమారి, సెక్రటరీ వరలక్ష్మి, వెలుగు సిబ్బంది .శివాజీ, ఆనంద్, వీఆర్వో గంగమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి సభ్యులు వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న శంకర్‌నాయుడు

ఎన్నికల్లో టిడిపి గెలుపే ధ్యేయం

ప్రజాశక్తి -హుకుంపేట:2024 ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని అల్లూరి జిల్లా ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి పట్టిబోయిన శంకర్ నాయుడు పిలుపునిచ్చినిచ్చారు. మండలంలో కేంద్ర లోని శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు లబోదిబో మంటున్నారన్నారు.. పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతునాయన్నారు.2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలో వచ్చే విధంగా అరకు అసెంబ్లీ లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముల్యపుట్టు వైస్ సర్పంచ్ మత్యారాజు, జరకొండ మాజీ వైస్ సర్పంచ్ మదేల చినయ్య, టీడీపీ సీనియర్ నాయకులు మజ్జి కైలాష్, నైని రమేష్, రెగం తిరుపతి, రేగం పద్మారావు, మజ్జి మూర్తి, సిరగం అప్పన్న, సిరగం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీటీడబ్ల్యూఏ నెంబర్ వన్ స్కూల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై శనివారం రెడ్ క్రాస్ వాలంటీర్లు అవగాహన కల్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ లైఫ్ సభ్యులు జి.గౌరీ శంకర్‌రావు మాట్లాడుతూ, విద్యార్థులు తరచూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ శ్రీ లోహిదాస్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో రెడ్ క్రాస్ చేసిన సేవలను కొనియాడారు. లైఫ్ సభ్యులు శ్రీ సూర్యారావు మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్, వాలంటీర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎం.శేషాద్రి, పి. ఈటీ ప్రభాకర్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు

హైస్కూల్లో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుమారు పలు రకాల 50 మొక్కలను నాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదావరి, శబరి వరద ముంపుపై

ముందస్తు చర్యలు చేపట్టాలని జెసికి సిపిఎం వినతి

ఐటిడిఎకు రెగ్యులర్ పిఒను నియమించాలని డిమాండ్

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు వల్ల గోదావరి, శబరి నదీ పరివాహక ప్రాంతాల్లోని వరదల ముంపు ప్రజానీకానికి ముందస్తు సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వరదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి శివ శ్రీనివాస్‌ను సిపిఎం నాయకులు కలిసి ముంపు ప్రాంత సమస్యలను వివరించారు. చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండల ప్రజలు గతేడాది జులై నెలలో వచ్చిన వరదలకు సర్వం కోల్పోయారని, ప్రతి ఏటా ప్రజలు, రైతాంగం, వ్యాపారస్తులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో వచ్చే వరదలకు ఇక్కడ ప్రజానీకానికి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, మూడు నెలలకు సరిపడా 16 రకాల నిత్యవసర వస్తువులను ప్రతి కుటుంబానికి అందించాలని, సచివాలయ కేంద్రాల పరిధిలో వరదకు సంబంధించి బఫర్ స్టాక్ ఏర్పాటు చేసి వారికి ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యం, విద్యుత్, రహదారులకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, శాశ్వత పరిష్కారాలు పరిశీలించాలని, అత్యవసరంగా ప్రజలను తరలించడానికి ప్రతి మండలానికి రెండు లాంచీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏకు శాశ్వత ప్రాజెక్టు అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సీసం సురేష్, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కొమరం పెంటయ్య, పులి సంతోష్, వి.ఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, ఎం.నాగమణి, ఎంపీటీసీ అమ్మోజీ, సిపిఎం ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జెసి శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, ప్రజాప్రతినిధులు

విఆర్.పురం మండల సమస్యలపై...

విఆర్.పురం : విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్న బాబు, సర్పంచ్‌ల ఆధ్వర్యాన విఆర్.పురం మండల సమస్యలపై జెసికి వినతిపత్రం అందజేశారు. అన్నవరం వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం, పెద్దమట్టపల్లి నుండి నర్సింగ్‌పేట వరకు బిటి రోడ్డుకు నిధుల కేటాయించాలని, కుందులూరు నుండి కొండపల్లి మీదుగా తులసిపాక వరకు రోడ్డు నిర్మిచాలని, వరదల సమయంలో తెల్లవారిగూడెం నుండి అక్కమ్మ పాలెం మీదుగా కరెంట్ స్తంభాలు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ప్రతి కుటుంబానికి టార్పాలిన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వరద పునరావాస చర్యల్లో కార్యదర్శుల పాత్ర కీలకం

డిఎల్ పిఒ రాఘవన్

ప్రజాశక్తి-చింతూరు

రానున్న వరదల్లోనూ, వరదకు ముందు, వరద తీసిన తర్వాత విధి నిర్వహణలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని డిఎల్‌పిఓ రాఘవన్ అన్నారు. చింతూరు ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో రాఘవన్ మాట్లాడారు. వరద పునరావాస కేంద్రాల నిర్వహణలోనూ, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ, పారిశుధ్య సేవలు అందించటంలోనూ, ప్రజారోగ్య పరిరక్షణ విషయంలోనూ పంచాయతీ కార్యదర్శులు అంకుటిత దీక్షతో పనిచేయాలని కోరారు. సచివాలయంలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులను సమన్వయ పరచడంలోనూ, పారిశుధ్యం, ప్రజారోగ్య సామగ్రిని సమకూర్చుకోవడంలోనూ, అదనపు సిబ్బందిని సమకూర్చుకోవడంలోనూ పంచాయతీ కార్యదర్శులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరత్నం, చింతూరు, కూనవరం, ఎటపాక, విఆర్ పురం పంచాయతీ విస్తరణ అధికారులు, నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రాఘవన్

మోతుగూడెం పోస్టాఫీసును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెంలో పోస్టాఫీసును పునరుద్ధరించాలని మోతుగూడెం ఎంపిటీసి వేగి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. డొంకరాయిలో శుక్రవారం జరిగిన పోస్టల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన గిరిజన గ్రామాల్లో సుమారు 50 సంవత్సరాలు సేవలు అందించిన పోస్ట్ ఆఫీస్‌ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తరుణంలో దేశంలో కొత్త కొత్త సేవలతో ముందుకు వస్తున్న పోస్టాల్ డిపార్ట్మెంట్ మోతుగూడెం గిరిజన మేజర్ గ్రామపంచాయతీలో తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నోసార్లు ఇక్కడ పోస్ట్ ఆఫీస్‌ని తీయడం కరెక్ట్ కాదని విన్నవించామని, అయినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఒక రిజిస్టర్ లెటర్ వచ్చిందంటే దాన్ని అందచేసే పోస్ట్మాన్ కూడా లేకుండా పోయారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో భద్రాచలం డివిజన్లో భద్రాచలం తర్వాత పెద్ద పోస్ట్ ఆఫీస్ ఇదేనని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో సమస్యలను కూడా పరిగణ లోకి తీసుకొని పోస్టలు డిపార్ట్మెంట్ అధికారులు ఆలోచించి మోతుగూడెంలో పోస్టాఫీసును పునరుద్ధరించాలని కోరారు.

వైద్యం కోసం తెలంగాణకు వెళ్తున్నాం..

- విలీన మండలాల్లో అన్నీ రకాల వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- జెడ్‌పి సమావేశంలో జెడ్‌పిటిసి విజయ

ప్రజాశక్తి-విఆర్.పురం

ఏ జబ్బు చేసినా తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ఆసుపత్రులకు వెళ్లవలసి వస్తోందని కూనవరం జెడ్పీటిసి విజయ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాకినాడలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన విలీన మండలాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఐసియూ ఏర్పాటు చేసి నిరుపేదలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆమె కోరారు. విలీన మండలాల్లో అన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్త పరీక్షలు, ఎక్సరేలు, స్కానింగ్, సౌకర్యాలు కల్పించి, స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటుకు ప్రభుత్వం సహాకరించాల విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా డెంగీ, ప్లేట్లెట్స్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ప్రాణదానం చేసిన వాళ్ళమౌతామన్నారు. మందులు ఏర్పాటు చేయాలని కోరారు



జిల్లా పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి విజయ

రేడియోగ్రాఫర్‌ను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్‌ను వెంటనే నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేసారు. గత వారం రోజులుగా ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్ లేనందున ఎక్స్ రే రూమ్ మూత పడిందని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం రోజుల నుండి ఎక్స్ రేలు తీయడం నిలిచి పోయాయని తెలిపారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఎక్స్ రే మిషన్ తరచూ మరమ్మతు గురవుతుందని, కొత్తది ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లిలో వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం శనివారం సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. సిపిఎం నాయకులు బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం గ్రామంలో స్థానిక వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఇంటి ఆవరణతో పాటు పరిసరాలను, సామాజిక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బంది సూచించారు. ఇంటి ప్రదేశంలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమకాటుతో డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు కె.చిన్నారావు, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, కొండా రమేష్ బాబు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -పాయకరావుపేట: మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ కోడా కోటేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డు హరిబాబు, వాలంటీర్ల కన్వీనర్ మైలపల్లి శివాజీ, ఆధ్వర్యంలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ, సిసి రోడ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై పలువురు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సిసి రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే గ్రామంలో డ్రైనేజీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు జగతా శీను, మోస శ్రీను, సూరాడ గోపి, ఎంపిటిసి మహాలక్ష్మి, మత్స్యకార డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, మైలపల్లి అశోక్ చక్రవర్తి, స్కూల్ చైర్మన్ మైలపల్లి కాసులు పాల్గొన్నారు.

పథకాలు అందేలా చర్యలు

నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ ఆరో వార్డులో శనివారం గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నిర్వహించారు. సంక్షేమ పథకాలు సాంకేతిక కారణాలతో లబ్ధి పొందలేని వారి వివరాలను అక్కడికక్కడే వాలంటీర్లతో నమోదు చేయించారు. సమస్యలు పరిష్కరించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ వైస్ చైర్పర్సన్ కొత్తకోట సుబ్బలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మళ్ళ గణేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ యారగిరి మణి, వార్డ్ ఇంచార్జ్ యారగిరి శేషు, వైస్ చైర్మన్ లు తమరన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ వోలి, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, గొలుసు నరసింహమూర్తి, కో ఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, వైసిపి నాయకులు దనిమిరెడ్డి నాగు, వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు గణమ్మ ప్రధాన కార్యదర్శి గంటా లలిత, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, ఉగరు స్వామి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: హమాలీ (ముఠా) కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం సిఐటియు జిల్లా అధ్యక్షులు అడిగర్ల రాజు మీడియాతో మాట్లాడుతూ, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 1000 మంది వివిధ రకాల హమాలీ పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. హమాలీ పనులతోనే వ్యాపారం వృద్ధి చెందుతున్నప్పటికీ, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు పన్నులు వసూలు చేస్తున్నాయన్నారు. హమాలీలకు ప్రమాద భీమా, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలు ప్రమాదాలకు గురైన సందర్భంలో కుటుంబం పోషణకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులకు ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, పెన్షన్‌లు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం హమాలీ (ముఠా)కార్మిక సంఘం (సిఐటియు) ప్రెసిడెంట్ రుత్తల గోవింద్, కొశాదికారి ఎం. రమణ, రాము, రాజు, సాంబ, సత్తిబాబు, నాగేశ్వరరావు, అప్పారావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టేందుకు కమిటీ వేయాలి

28 నుంచి పోరు యాత్ర
రౌండ్ టేబుల్ సమావేశంలో ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు నిపుణులతో కమిటీ వేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. చేయి చేయి కలుపుదాం, హింస లేని సమాజం నిర్మిద్దాం, మద్యం, మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వ నిషేధించాలి, హింస నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని సమావేశం కోరింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య వక్తలుగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది, ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మ మాట్లాడుతూ, మారే కాలంతో పాటు మహిళలపై హింస విపరీతంగా పెరుగుతుందన్నారు. అసమానతలు, అవమానాలు, అత్యాచారాలు రకరకాల కొత్త రూపాలలో నారీ లోకాన్ని ఆవేదనకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబాలలో, పని ప్రదేశాలలో, సమాజంలో ఆర్థిక, లైంగిక దోపిడీ తీవ్రమవుతుందన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ అవి అరకొరగానే ఉన్నాయన్నారు. మహిళలపై హింస నిరోధానికి నిజమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నపిల్లల మీద వేధింపులు, అత్యాచారాలు అక్రమ రవాణా, నిర్బంధం, ఎత్తుకెళ్లిపోవడం వంటివి బాగా పెరిగాయని తెలిపారు. విశాఖ నగరంలో కూడా ఇటువంటి కేసులు రోజుకు 15 నుంచి 20 వరకు దిశ పోలీసుస్టేషన్‌లో నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. వర్మ కమిషన్ సిఫారసు ప్రకారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన నేరస్తులకు శిక్ష పడాలని, శిక్షాకాలం పెంచాలని, అందుకు పోలీస్ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలని కోరారు. రాజకీయ నాయకులు జోక్యం ఉండరాదన్నారు. జిల్లాకు రక్షణాధికారిని నియమించాలని, మహిళా పోలీస్ స్టేషన్లు, మహిళా కోర్టుల సంఖ్య పెంచాలని డిమాండ్‌చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు

మహిళల హింసపై ఐద్వా ఆధ్వర్యాన ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు పోరు యాత్ర చేపడుతున్నట్లు సభాధ్యక్షురాలు వై. సత్యవతి తెలిపారు. ఆగస్టు 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ, జివి.పద్మావతి, వర్కింగ్ వుమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ (సిఐటియు) కన్వీనర్ పి.మణి, విసిసి జిల్లా నాయకులు ఎ.మణి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.తులసి,ఐద్వా నాయకులు ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, బి.భారతి, గౌరి, ఎ.పుష్ప, ఎస్.విజయలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, కె.వేణు, ఆర్.విమల, సుజాత, కల్యాణి.వై తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై దాడికి బాధ్యులను శిక్షించాలి

కెవిపిఎస్ నిరసన


నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దళిత కుటుంబంపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కులం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. శనివారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోపాలపట్నం నేతాజీనగర్‌లో 70 ఏళ్లుగా నివాసముంటున్న దళిత కుటుంబాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని కులం పేరుతో దూషించి, భౌతిక దాడి చేయడం దుర్మార్గమన్నారు. 90 ఏళ్ల తల్లితో ఉంటున్న ముక్కు సుబ్బారావు కుటుంబంపై భౌతిక దాడి చేసిన రాయుడు, రమణ, శ్రీనుతో పాటు, మరో 40 మంది కులం పేరుతో దూషించారని, పోలీసుల ఎదురుగానే దాడి చేస్తున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కెవిపిఎస్ గోపాలపట్నం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ, దళితులపై జరిగే అన్యాయాన్ని అరికట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతామని హెచ్చరించారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, అందరూ ఏకమై దళిత కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర రావు, రాము, రాజు, అన్నపూర్ణ, ఎర్రి బాబు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట : జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని ఎంపిడిఒ కె.ప్రభాకరరావు సూచించారు. శనివారం మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలోని జగనన్న కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోరు వేయించి మోటారు బిగించలేదని లబ్ధిదారులు తెలిపారు. మోటారు వేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతల శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ ప్రేమానందం, సచివాలయ అధికారి సాయి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటవురట్ల: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. లింగాపురం గ్రామంలో జగనన్న కాలనీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మిస్తున్న కాలనీ ఇల్లు వివరాలు గృహ నిర్మాణశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని, వారికి అవసరమైన గృహ నిర్మాణ సామగ్రి, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎసిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని జోన్-2 ఎసిపి ట్రాఫిక్ జి.రాజీవ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు ఎగ్జామ్ పార్క్ ఏరియా డాక్ యార్డ్ లారీ పార్కింగ్ స్టాండ్‌లో శనివారం లారీ డ్రైవర్లకు రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి డ్రైవర్ తన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో హార్బర్ సర్కిల్ ట్రాఫిక్ సిఐ జిఆర్ఆర్.తులసీదాస్, మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ ఎం.సుదర్శనరావు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎం.బాపిరాజు, కార్యదర్శి పి.వెంకటరాజు, కోశాధికారి కె.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'గోడలపై పోస్టర్లు కనిపిస్తే ఉపేక్షించేది లేదు'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలో ప్రభుత్వ, ప్రయివేటు గోడలపై ఎటువంటి పోస్టర్లు కనిపించినా ఉపేక్షించేది లేదని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ హెచ్చరించారు. ఇకో-వైజాగ్‌లో భాగంగా విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరినాలో శనివారం వార్డు సచివాలయ కార్యదర్శులతో పెయింట్ మై స్ట్రీట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని, ఇకో-వైజాగ్‌లో భాగంగా పెయింట్ మై స్ట్రీట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని రోడ్ల పక్క గోడలపై ఎన్జీవోస్ ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో స్కూల్ విద్యార్థులచే పెయింట్ వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నగర సుందరీకరణలో భాగంగా గోడలపై పోస్టర్లు కనిపిస్తే ఆ వార్డు సచివాలయ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లాన్ ప్రకారం నిర్మించని ఇళ్లను నిర్మాణ దశలోనే అడ్డుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023కు కార్యదర్శులు సహకరించి అనుకూలమైన ఫీడ్‌బ్యాక్ ఇప్పించి మొదటి ర్యాంకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డిసిపిలు నరేందర్ రెడ్డి, పద్మజ, ఎసిపిలు, టిపిఎస్‌లు పాల్గొన్నారు.

బెడ్ షీట్ క్యాలెండరింగ్, ఫోల్డింగ్ మెషిన్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గాజువాకలో ఉన్న అల్ట్రా వాష్‌టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను శనివారం వాల్తేర్ డిఆర్ఎం అనుప్ సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా వాషింగ్ ఫెసిలిటీ వద్ద కొత్త అధునాతన యంత్రాలను లాంఛనంగా ప్రాంభించారు. బెడ్ షీట్ క్యాలెండరింగ్, ఫోల్డింగ్ మెషిన్, వాషర్ ఎక్స్‌ట్రాక్టర్లు వంటి సదుపాయాన్ని ఏర్పాటు చేసినందుకు అల్ట్రా గ్రూప్ ఆఫ్ కంపెనీల సిఎండి ఎల్‌జి.త్రినాధరావును డిఆర్ఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్‌కె.పాత్ర, కోచ్ డిపో ఆఫీసర్ ప్రవీణ్ భాటి పాల్గొన్నారు.

సిసి డ్రెయిన్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఎర్నె దుర్గానగర్‌లో రూ.16 లక్షలతో సిసి కాలువల నిర్మాణానికి తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ సిపికి 16 ఫిర్యాదులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : డయల్ యువర్ సిపి కార్యక్రమానికి 16 ఫిర్యాదులందాయి. డిసిపి-1 వి.విద్యాసాగర్‌నాయుడు శనివారం డయల్ యువర్ సిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 మంది కాలర్స్‌తో ఫోన్ మాట్లాడిన డిసిపి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిసిపిలు ఎంఆర్‌కె.రాజు, నాగేంద్రుడు పాల్గొన్నారు.

నిధుల మంజూరులో అన్యాయం

ప్రజాశక్తి-రావికమతం: ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులలో కవగుంట గ్రామ పంచాయతీకి పూర్తిగా అన్యాయం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, సుమారు 2000 జనాభా కలిగి ఎస్సీ, ఎస్టీ గిరిజన గ్రామమైన కవగుంట గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం బేసిక్, టైడ్ ఫస్ట్ ఇన్స్టాల్మెంట్ కింద 63,450 మంజూరు కావడం చాలా హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా ఏ పంచాయతీకి కూడా 1,50,000 తక్కువ లేకుండా అత్యధికంగా 22 లక్షల రూపాయల వరకు వచ్చిన పరిస్థితులు ఉన్నాయన్నారు.ఏ ప్రాతిపదికన ఈ నిధులు మంజూరు చేశారని ప్రశ్నించారు.

వ్యక్తిత్వ వికాసమే విద్య లక్ష్యం

ప్రజాశక్తి -ములగాడ : వ్యక్తిత్వ వికాసమే విద్య ముఖ్య లక్ష్యమని సెయింట్ ఆన్స్ కళాశాల హిందీ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ పూర్వ ప్రోగ్రాం అధికారి ఎ.ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న మహిళా సాధికారత తరగతుల్లో వ్యక్తిత్వ వికాసంపై వివరించారు. ప్రతిఒక్కరూ సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలని, బలాలు, బలహీనతలేమిటో తెలుసుకుని బలాలకు పదునుపెట్టుకోవడం, బలహీనతలను అధిగమించడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకుని విజయాన్ని సాధించాలన్నారు. సమయపాలన ప్రాధాన్యతపై శివరంజని ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మహిళా సాధికారితపై మూడు రోజుల శిక్షణ తరగతులు ముగిసాయి. డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమనికళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. సదస్సులో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించిన అధ్యాపకులు అంజలీదేవి, ప్రశాంతి,ప్రేమలత పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన సింహగిరి

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిక్కిరిసింది భక్తుల అధిక సంఖ్యలో తరలి రావడంతో రూ.100, రూ.300టిక్కెట్లతోపాటు ఉచిత దర్శనాల్లో క్యూలైన్ల రద్దీగా కనిపించాయి అన్నదానం కోసం క్యూ లైన్‌లో భక్తులు పెద్దఎత్తున బారులుదీరారు. దర్శనానికి వచ్చిన భక్తుల రద్దీతో ఎంక్వయిరీ ఆఫీస్ పూర్తిగా నిండిపోయింది. ప్రసాదాలు కౌంటర్ వద్ద సరైన క్యూలైన్ లేక భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. భక్తుల రద్దీ కారణంగా కొండ దిగువ నుంచి కొండపై వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు

అప్పన్న సన్నిధిలో అవంతి

సింహాచలం: సింహాద్రి అప్పన్న భీమిలి ఎమ్మెల్యే ముత్యంశెట్టి శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాధనంగా స్వాగతం పలికారు. ఆలయంలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ ఎఇఒ భ్రమరాంబ, ఇఇ ఈ శ్రీనివాసరాజు దుశ్శాలువాతో అవంతిని సత్కరించి, స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

ఫ్యాన్ ఆగిపోతే పథకాలు ఆఫ్!

ప్రజాశక్తి-పద్మనాభం : వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమితో ఫ్యాన్ అగిపోతే పథకాలన్నీ ఆగిపోతాయిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని, పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. పాండ్రింగి గ్రామానికి గోస్తనీనదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.16.50కోట్లు నిధులు మంజూరై, టెండర్లను ఆహ్వానించారన్నారు..పద్మనాభం నుంచి శాంతినికేతన్ వరకు రోడ్డు విస్తరణ పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె రాంబాబు. జెడ్పిటిసి సుంకర గిరిబాబు. ఎంపిడిఒ ఎం విజయకుమార్. ఎంపిటిసి ఈర్ల రాజేశ్వరి, నాయకులు ఎస్.ఆదిబాబు. బి సన్యాసినాయడు పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటరు జాబితా సమగ్రంగా రూపొందించేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటికీ వెళ్లి తమ సిబ్బంది పరిశీలిస్తారని స్థానిక ఆర్‌డిఒ, భీమిలి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి ఎస్ భాస్కరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఓటరు జాబితాతో ఇంటి వద్దకు వచ్చే బిఎల్‌ఒలకు సహకరించాలని కోరారు. నిర్ణీత తేదీల్లో ఓటరు జాబితా పరిశీలన, తప్పొప్పులు సవరిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

17వరకు డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిగ్రీలో ప్రవేశం పొందేందుకు రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 17వతేదీకి పొడిగించినట్లు స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు

ఘనంగా ఎసిఎ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి పిఎం.పాలెం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి స్టేడియం అవరణలో పతాకావిష్కరణ చేసి మొక్కలను నాటారు. ఎసిఎ ఏడు దశాబ్దాల ప్రయాణాన్ని సూచిస్తూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ ఇయర్ లోగోను ఆవిష్కరించారు. భారత్‌కు తొలి టెస్టు కెప్టెన్, ఎసిఎ తొలి రంజీ కెప్టెన్ సీకే నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈసందర్భంగా గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ 70వసంతాల చరిత్ర కలిగిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ దినదినాభివృద్ధి చెందుతూ నేడు దేశవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయిలో నిలవడం గర్వంగా ఉందన్నారు. భారత జాతీయజట్టుకు నైపుణ్యులైన క్రికెటర్లను అందించేందుకు ప్రతిజిల్లాలోనూ 18 టాప్-క్లాస్ గ్రౌండ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. క్రికెట్ క్రీడపై ఆసక్తి కలిగి, అవకాశాల కోసం ఎదురుచూస్తున్న క్రీడాకారులను ప్రతి జిల్లా నుంచి వెలుగులోకి తెస్తామన్నారు. రెసిడెన్షియల్ అకాడమీలు, ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ప్రారంభం, మహిళా టి20, మాజీ రంజీ ప్లేయర్‌లకు మద్దతు తదితర కీలక అంశాలను వివరించారు. కార్యక్రమంలో విడిసిఎ కార్యదర్శి పార్థసారథి, ఉపాధ్యక్షులు ఎస్ఎస్ఆర్‌కె ప్రసాద్, సిఇఒ వెంకట శివారెడ్డి, డి.సంజయ్, ఎఫ్ఒ నవీన్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎసిఎ సెక్రటరీ గోపీనాథరెడ్డి

గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు మద్దతుగా
జాతీయస్థాయిలో ఉద్యమం

ఆల్ ఇండియా వాటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందకుమార్, నరేంద్రరావు


మాట్లాడుతున్న నరేంద్రరావు

ప్రజాశక్తి -గాజువాక : ఆదాని గంగవరం పోర్టు నిర్వాసితకార్మిక సమస్యలు పరిష్కరించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆల్ ఇండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి నందకుమార్, టి నరేంద్రరావు స్పష్టం చేశారు. వేతన పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి పోర్టు కార్మికులు చేపడుతున్న నిరవధిక నిరసన దీక్షలు శనివారం 12వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని సందర్శించిన వారు మాట్లాడుతూ, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల న్యాయమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆదివారం పోర్టులో నిర్వహించే సమావేశంలో అన్ని యూనియన్ల మద్దతు కూడగడతామన్నారు. అలాగే ఈనెల 18,19 తేదీల్లో చెన్నైలో ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించి, అన్ని పోర్టుల మద్దతునిప్పిస్తామన్నారు. వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్న కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ సెక్రెటరీ ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి జగన్ దీక్షాశిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు, వాసుపిల్లి ఎల్లయ్య, ఎల్లాజీ గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, గంటిపల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి వారి సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. శనివారం విశాఖ వ్యాలీ స్కూల్‌లో డిఇఒ ఎల్.చంద్రకళ అధ్యక్షతన ఎంఇఒలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా, వారి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధికి దోహద పడేలా తీర్చిదిద్దాలని సూచించారు. టెన్త్‌విద్యార్థులపైనే కాకుండా, అన్ని తరగతులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఆదేశించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఎంఇఒలను ఆదేశించారు. రానున్న వర్షాల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శిథిల భవనాలలో తరగతులు నిర్వహించకుండా ముందస్తు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తగా ఉండాలని సూచించారు. పిల్లల్లో ఆటపాటలను ప్రోత్సహించాలని, ఆటల సమయంలో ఏ పిల్లవాడు తరగతి గదుల్లో ఉండకుండా చూడాలన్నారు. అనంతరం డిఇఒ చంద్రకళ విద్యా విషయాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అపోలో వైద్యుడికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో వైద్యులు ప్రొఫెసర్, హెచ్‌ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన నాలుగు శాస్త్రీయ కథనాలు ఈ నెల నవంబరులో ఈజిప్టు, కైరోలో జరగనున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాలజీ వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రదర్శనకు ఆమోదించబడ్డాయి. ఈమేరకు ఎస్ఐసిఒటి కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ లేఖను పంపింది. అపోలో ఆసుపత్రిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అబ్దుల్ డి ఖాన్‌కు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం హర్షం వెలిబుచ్చింది. బొటనవేలు, చీలమండ ఆర్థ్రోస్కోపి, పాదంలో వైకల్యం దిద్దుబాటు వంటి శస్త్ర చికిత్సలను ఆధునిక ప్రక్రియల ద్వారా చేపట్టడంలో డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ నిష్ణాతులు.


డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

గ్రామస్థాయి నుంచే నిరుద్యోగ నిర్మూలన

ప్రజాశక్తి -గాజువాక : గ్రామస్థాయి నుంచి నిరుద్యోగాన్ని నిర్మూలనకు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలు, స్కిల్ హబ్స్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని ప్రభుత్వ సలహాదారుడు, స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫైర్ ప్రతినిధి జి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం విశాఖ డెయిరీ ప్రైవేట్ స్కూల్ వరల్డ్ యూత్ స్కిల్‌డేను సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతకు శిక్షణతోపాటు ఉపాధి కల్పించే యోజనలో ప్రభుత్వం ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్య మ్యాన్‌పవర్ సమీకరణలో భాగంగా ముందుగా యువతలోని నైపుణ్యాలను గుర్తించి, శిక్షణనిస్తామన్నారు.

గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో ఉందని కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. సిడాప్ సిఇఒ ఎంకెవి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో 15 నుంచి 35ఏళ్లలోపు యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ శోభారాణి, జెడి ఎం కల్యాణి పాల్గొన్నారు.

ఘనంగా రాజా సిద్ధార్థ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆనందపురం : రాష్ట్ర అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాజా సిద్ధార్థ జన్మదిన వేడుకలు శనివారం మండల కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఫెంపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ ప్రధాన కార్యదర్శి, ఫెంపా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యన్ సుగుణేశ్వరి ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్ఎల్ రావు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ, వైఎస్సార్ హాయంలో జిఒ 429 తెచ్చి, గ్రామీణ వైద్యుల జీవితాల్లో రాజాసిద్ధార్థ వెలుగులు నింపారన్నారు. రద్దయిన ఆ జిఒ పునరుద్ధరణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, క్రమశిక్షణ కమిటీ కో కన్వీనర్ రాలి అప్పారావు, జయరావు, కడగల నారాయణరావు, జిబి రాజు, ఆనందపురం మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రఘు, ఎస్ శ్రీనివాసరావు, వాసు, శివ, బెహరా రాధిక పాల్గొన్నారు.

చేనేత కార్మికులతో భేటీ

ప్రజాశక్తి -తగరపువలస : వృత్తిపరంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ చేనేత కార్మిక సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, తదితరులతో చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి శనివారం తగరపువలసలో చర్చించారు.చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ చేనేత కార్మిక సంఘం జాతీయఅధ్యక్షులు ఎ.మల్లికార్జునరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రుషింగప్ప పిలుపుమేరకు ఇటీవల అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తమ వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారని సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు